క్లుప్తంగా

ధ్యానంతోనే ఏకాగ్రత



ముక్కామలలో విద్యార్థులకు ధ్యానం గురించి వివరిస్తున్న విశ్వనాథం

పెరవలి: ధ్యానంతోనే ఏకాగ్రత, క్రమశిక్షణ లభిస్తాయని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. వేసవి శిక్షణలో భాగంగా ఆదివారం ముక్కామల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. పిరమిడ్ మాస్టారు కరుటూరి విశ్వనాథం మాట్లాడుతూ విద్యార్థులు ఆటలతో పాటు ధ్యానం నేర్చుకుంటే వారికి జ్ఞాపక శక్తి, చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. గ్రంథాలయాల్లో అనేక పుస్తకాలు ఉంటాయని, మనకు ఏది అవసరం అనుకుంటే అవి తీసుకుని ప్రతి రోజు చదివేలా అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సలాది సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన

చాగల్లు: చంద్రవరం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పోస్టల్ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తాడేపల్లిగూడెం పోస్టల్ అసిస్టెంట్ డి.రామకృష్ణ పోస్టల్ స్టాంపులు, ఎక్‌నాలెడ్జిమెంట్, ఎన్‌వలప్‌కవర్లు, పోస్టు కార్డులు, రెవెన్యూ స్టాంపులు తదితర వాటి గురించి విద్యార్థులకు వివరించి, వాటిని చూపించారు. బాలికలకు సుకన్య సమృద్ధి యోజన పథకం, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్‌లు తదితర వాటి గురించి వివరించారు.

నేడు స్పందన

దేవరపల్లి: మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు మండల ప్రత్యేక అధికారి జగదాంబ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. మండల స్థాయి అధికారులు హాజరై అర్జీలు స్వీకరించాలని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



సత్యనారాయణ రెడ్డి

పెరవలి: అజ్జరం గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణరెడ్డి(75) ఈ నెల 8వ తేదీన బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పెరవలి ఎస్సై ఎం.సూర్యభగవాన్ తెలిపారు.

చిన్నాయగూడెంలో పొగాకు బ్యారన్ దగ్ధం

దేవరపల్లి: చిన్నాయగూడెంలో మహిళా రైతు గడా దివ్యభారతికి చెందిన పొగాకు బ్యారన్ దగ్ధమైయింది. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో బ్యారన్‌లో దట్టమైన మంటలు వ్యాపించాయి. మంటల్లో బ్యారన్‌లోని సుమారు 7 క్వింటాళ్ల పొగాకు కాలిబూడిదైనట్టు దివ్యభారతి తండ్రి గడా జగదీష్ తెలిపారు. పొగాకు ఖరీదు రూ.1.50 లక్షలు, బ్యారన్ ఖరీదు రూ.1.50 లక్షలు ఉంటుందని ఆయన చెప్పారు. దాదాపు రూ.3 లక్షలు నష్టం ఉంటుందని ఆయన తెలిపారు. బ్యారన్‌కు ఆనుకుని ఉన్న మరొక రెండు బ్యారన్లు పాక్షికంగా దెబ్బతిన్నట్టు ఆయన చెప్పారు. గ్రామస్తులు ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను ఆర్పినట్టు ఆయన చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియవని, బీడుగొట్టం రంధ్రం పడి మంటలు వ్యాపించి ఉంటాయని గ్రామస్తులు అంటున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని సెయింట్ ఆంబ్రోస్ స్కూల్ క్రీడా మైదానంలో చెన్నా త్రినాథ్, కొల్లి ప్రవీణ్‌కుమార్ జ్ఞాపకార్థ నిడదవోలు ప్రిమియర్ లీగ్ పేరున నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ళ భాగ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు ఎస్‌కే వజీరుద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

కంబాలచెరువు: ప్రపంచ మాతృదినోత్సవం సందర్భంగా స్థానిక డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు స్మారక పార్కు ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డేకేర్ భవనంలో ఆదివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ మాతృమూర్తుల ఔన్నత్యం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని వివరించారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమం, భరణం చట్టం 2007, ఇతర న్యాయసేవలపై అవగాహన కల్పించారు. సదస్సులో అశోక్ కుమార్ జైన్, కె.నిర్మల, రజనీ శేషసాయి పాల్గొన్నారు.

వేసవి శిక్షణ.. భవితకు రక్షణ

- సమ్మర్ కోచింగ్‌లో విద్యార్థులు బిజీబిజీ
- సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న యువత
- కంప్యూటర్‌తోపాటు స్పోకెన్ ఇంగ్లిష్, యోగా కోర్సుల్లో శిక్షణ



తాళ్లపూడిలో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు



సమ్మర్ క్యాంపులో యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

తాళ్లపూడి: ఈ పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం మనిషికి నిత్యావసరమైంది. యువత దాని వెంటే పరుగులుతీస్తోంది. అన్నింటా ఆన్‌లైన్ వినియోగం బాగా పెరిగింది. పైగా పోటీ పరీక్షలు కూడా అన్ని ఆన్‌లైన్లోనే నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు వేసవి సెలవులను వృథాగా పోనివ్వకుండా కంప్యూటర్, ఇంగ్లిష్, యోగా తదితర వాటిపై పట్టుకోసం ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గంలోని తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు మండలాల్లోని వేసవి శిక్షణ తరగతుల్లో యువతీ యువకులు మునిగి తేలుతున్నారు. ఇంటర్ పూర్తి చేసిన వారు ఎంసెట్, కంప్యూటర్, టెన్త్ పూర్తి చేసిన వారు పాలిటెక్నిక్, ఏపీ ఆర్‌జేసీ, కంప్యూటర్ కోర్సులపై, చిన్నారులు యోగా, డాన్స్ తదితర తరగతుల్లో బిజీబిజీగా ఉన్నారు. సుమారు 2 వేల మంది వరకు శిక్షణలకు హాజరవుతున్నారు.

కంప్యూటర్‌పై ఆసక్తి

కంప్యూటర్ ఆన్‌లైన్ వినియోగం పెరుగుతుండడంతో విద్యార్థులు నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉన్న కాస్త సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. బేసిక్స్, ఆటోమేషన్, ఎంఎస్‌ఆఫీస్, ఎంఎస్ ఎక్సెల్, డ్రాయింగ్, పీజీడీఏ, డీసీఏ తదితర కోర్సులను నేర్చుకుంటున్నారు. దీంతో కంప్యూటర్ సెంటర్లు రద్దీగా మారుతున్నాయి. వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని 30 నుంచి 45 రోజుల వ్యవధిలో కోర్సులు నిర్వహిస్తున్నారు. నామమాత్రపు ఫీజులతో శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. వీటితోపాటు పులుచోట్ల యోగా, జిమ్, సంగీతం, డాన్స్ క్లాసులు సైతం నిర్వహిస్తున్నారు.

మానవత ఆధ్వర్యంలో శిక్షణ

మండల మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు పేరుతో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. నిపుణులతో కంప్యూటర్, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్‌పై వంద మందికి తరగతులు నిర్వహిస్తున్నారు. తాళ్లపూడిలో యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు సైతం విద్యార్థులకు యోగా, జిమ్ తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నారు.

పాలిటెక్నిక్, ఎంసెట్‌కు...

పాలిటెక్నిక్‌కు, నాలుగేళ్ల ఇంజినీరింగ్‌కు కరిబండి విద్యాసంస్థల్లో ఎంసెట్ శిక్షణ సైతం తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు సొంతంగా సన్నద్ధమవుతున్నారు. చిన్నారులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగేలా ప్రభుత్వం శాఖ గ్రంథాలయాల్లో చిన్నారులకు వేసవి శిక్షణ నిర్వహిస్తోంది.

ఆన్‌లైన్ పరీక్ష కోసం..



అన్ని పరీక్షలు ఆన్‌లైన్ ద్వారనే నిర్వహిస్తున్నారు. పదో తరగతి పూర్తి చేశాను. చదువు పూర్తి అయిన తరువాత పోటీ పరీక్షల్లో తలపడాలంటే ఇప్పటి నుంచే కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. ఈ సెలవుల్లో కంప్యూటర్ నేర్చుకుంటున్నాను.

– ఎం గాయత్రీ, 10వ తరగతి విద్యార్థి, తాళ్లపూడి

సమయం వృథా కాకుండా..



వేసవి సెలవులు వృథా చేయకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాం. 8వ తరగతి చదువుతున్నాను. కంప్యూటర్‌లో బేసిక్స్, ఎంఎస్ ఆఫీస్ నేర్చుకుంటున్నారు. కంప్యూటర్ నేర్చుకోవాలనే ఆసక్తితో క్లాసులకు వెళుతున్నాను.

– ఎ.రోహిత్, 8వ తరగతి విద్యార్థి, తాళ్లపూడి

గ్రామాల్లోనే శిక్షణలు



కంప్యూటర్ నేర్చుకుంటే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో పట్టణాలకు వెళ్లి శిక్షణ పొందేవారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కంప్యూటర్ సెంటర్లు పెట్టడంతో విద్యార్థులు సులువుగా నేర్చుకుంటున్నారు. వేసవి సెలవుల్లో 40 రోజుల కోర్సు అందిస్తున్నాం.

– జి.సాగర్, కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు, తాళ్లపూడి

ముగిసిన ముత్యాలమ్మ జాతర

తాళ్లపూడి: గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి, మొక్కులు సమర్పించుకున్నారు. జాతర సందర్భంగా శక్తి వేషాలు, గరగ నృత్యాలు, కేరళ వాయిద్యాలు, గోవిందా నృత్యాలు, బాణసంచా తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ నామా శ్రీనివాస్, వీరిశెట్టి రాంబాబు, గిద్దా రాంబాబు, కేతా సుబ్బారావు, యూత్ సభ్యుల జాతరను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందుకు పలు పార్టీల నాయకులు హాజరయ్యారు.

కోటసత్తెమ్మకు పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,01,803 ఆదాయం వచ్చినట్లు ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు.

సామూహిక ఉపనయనాలు

నిడదవోలు : పట్టణంలోని రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాల స్వామివారి ఆలయంలో ఆదివారం నిడదవోలు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సామూహిక ఉపనయనాలు నిర్వహించారు. బంధుమిత్రులు, సభ్యులు హాజరై వారికి ఆశీస్సులు అందించారు. పి.సురేంద్రకుమార్, ధూళ్లపాళ్ల సుబ్రహ్మణ్యం, నడిపల్లి ఆంజనేయులు, సోంభట్ల శాస్త్రీ, పొన్నా సుబ్రహ్మణ్యం, నిడమర్తి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఒనువులమ్మ జాతర

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో ఒనువులమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పుట్టింటి వారైనా మల్లిన కుటుంబ సభ్యులు, అత్తింటి వారైన పాలడుగుల కుటుంబ సభ్యుల పూజలతో కార్యక్రమాలు మొదలయ్యాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

త్వరలో వైద్యుల నియామకం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రెండు రోజుల్లో వైద్యులను నియమిస్తామని కలెక్టర్ కె.మాధవీలత హామీ ఇచ్చినట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చెప్పారు. ఆదివారం గోపాలపురం మండలం కరగపాడు సర్పంచ్ బొమ్మిన నాగమణి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరైన ఎమ్మెల్యే ఆసుపత్రి వైద్యుల నియామకంపై విలేకరులకు వివరించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అసంపూర్తిగా ఉన్న ఎక్స్‌రే మిషన్ రిపేరు, జనరేటర్ సదుపాయం త్వరలో కల్పిస్తామని ఆసుపత్రి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. కొంత మంది కావాలని ఆసుపత్రిపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని గుర్తుచేసారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో మంచినీటి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈయన వెంట మండల వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

పొగాకు రైతులను ఆదుకునేందుకు చర్యలు

గోపాలపురం: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పొగాకు రైతులను ఆదుకోవడానికి రైతు సంఘం బ్యారన్‌కు రూ.200 చొప్పున పొగాకు అమ్మకాల్లో చెల్లించేలా తీర్మానం చేసింది. దీనిపై అభ్యంతారాలు ఉన్న రైతులు గోపాలపురం పొగాకు బోర్డు అధికారులకు తెలియజేయాలని వేలం నిర్వాహణాధికారి కె.శ్యామ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల రైతు సంఘం ప్రతినిధులు అంగీకారంతోనే బోర్డు రైతుల వద్ద నుంచి సేకరించిన నగదును నష్టపోయిన రైతులకు అందజేస్తామని సూచించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్, వొకేషనల్ కోర్సులలో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్ఎస్‌వీఎల్ నర్సింహం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి కళాశాలలో దరఖాస్తులు విక్రయిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులకు సంబంధిత సర్టిఫికెట్ల నకళ్లు జతచేసి వెంటనే కళాశాలలో అందజేయాలన్నారు. మొదటి దశ అడ్మిషన్లు ఈనెల 26న ప్రారంభమవుతాయన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వచ్చేనెల ఒకటో తేదీ నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు గమనించాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల కలయిక



దేవరపల్లి మండలం చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూలు వద్ద పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

దేవరపల్లి: అలనాటి తీపిజ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు. చిన్నాయగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1997 నుంచి 98 సంవత్సరం వరకూ పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల వద్ద కలుసుకున్నారు. ఆనాటి గురువులు, విద్యార్థులు కలిసి పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ గురువులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో 2005–2006 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆప్యాయ పలకరింపులతో సందడి చేశారు. గురువులను సన్మానించారు.

మల్లికార్జున స్వామికి నాగాభరణం సమర్పణ



స్నానఘట్టంలో మల్లికార్జున స్వామికి త్రిశూలం, నాగాభరణం అమర్చుతున్న దాతలు

కొవ్వూరు: పట్టణంలో శ్రీనివాసపురం స్నానఘట్టంలోని రావణ బ్రహ్మ విగ్రహం వద్ద ఉన్న బ్రహ్మ సూత్రం మల్లికార్జున స్వామికి స్థానిక శ్రీనివాసపురానికి చెందిన జవ్వాది సురేష్, శోభారాణి దంపతులు, ధనలక్ష్మి ఇత్తడితో తయారు చేసిన నాగాభరణం, త్రిశూలం సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. శివభక్త రావణ బ్రహ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యుడు అనపర్తి శివరామకృష్ణ, అనపర్తి వాణి, రాజ్యలక్ష్మి, ఎ.భ్రమరాంబిక, రాయుడు చిన్న, దగ్గు ప్రసాద్, మద్దుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాల అడ్డగింపు

కొవ్వూరు: కుమారదేవం ఇసుక ర్యాంపులో మట్టి తవ్వకాలను స్థానిక టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. ర్యాంపులో లారీలను బయటకు వెళ్లనివ్వకుండా అడ్డుకోవడంతో నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్ఈబీ అధికారులు వచ్చి లారీలను బయటకు పంపించారు. ర్యాంపులో లారీలను అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ పి.సోమశేఖర్ హెచ్చరించారు.

చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీగౌతమి స్మార్ట్ స్కూల్లో జిల్లా చదరంగం పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో షణ్ముఖ రెడ్డి, రామ్‌చరణ్ తేజ, సాయేష్, సాకేత్, అలాగే మహిళల విభాగంలో కావ్యశ్రీ. ఆద్య, నేహశ్రీ, అన్విత విజేతలుగా నిలిచారు. సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో మహిళా విభాగం నుంచి నలుగురు, పురుషుల విభాగం నుంచి నలుగురు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని సంఘం కార్యదర్శి కుమార్ తెలిపారు.

హనుమజ్జయంతి వేడుకలు



పెరవలిలో లక్ష తమలపాకులతో పూజ చేస్తున్న పండితులు



రావిమెట్లలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న పల్లారావు, పార్టీ శ్రేణులు



కొవ్వూరు పట్టణంలోని మెరకవీధి ఆలయంలో సాముహిక పూజలు చేస్తున్న మహిళలు

కొవ్వూరు: హనుమత్ జయంతిని ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మెరకవీధిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో తమలపాకులు, గంధ సింధూరంతో సామూహిక పూజలు చేశారు. అంతకు ముందు స్వామివారికి జలాభిషేకం చేశారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అడ్డగర్ల వీరస్వామి, మురుకొండ శ్రీనివాస్, గంగాధర నాగేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పట్టణ పార్టీ గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. టాక్సీ స్టాండ్ వద్ద, గోష్పాదక్షేత్రం, కొవ్వూరు ప్రాంగణం ప్రవేశ ద్వారం వద్ద ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఏటిగట్టు, కాపవరం, వాడపల్లి, పెనకనమెట్ట, మద్దూరు, ఆరికిరేవుల, కుమారదేవం తదితర గ్రామాల్లోను హనుమాన్ జయంతి నిర్వహించారు.

పెరవలి: గ్రామంలోని అభయాంజనేయస్వామి జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. రావులపాలెంకు చెందిన ఆకుల వెంకటేశ్వరరావు దంపతులచే స్వామివారికి లక్ష తమలపాకుల పూజ, గంధసింధూరం పూజ పండితుల మంత్రోచ్ఛరణ మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. 35 అడుగుల అభయాంజనేయస్వామి పాదాల వద్ద లక్షతమలపాకుల పూజ చేయగా ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేశారు. సాయంత్రం చిన్నారులచే కోలాట నృత్యప్రదర్శన జరిగింది. ఖండవల్లిలో భక్తాంజనేస్వామి వారికి ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకర్షించింది.

ఉండ్రాజవరం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మోర్త, వేలివెన్ను, తాడిపర్రు, చివటం, సూర్యారావుపాలెం, వడ్లూరు తదితర గ్రామాల్లో అంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలతో పాటు హనుమాన్ చాలీసా పఠించారు. ఉండ్రాజవరంలో రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన శ్రీపంచముఖి అంజనేయస్వామి ఆలయాన్ని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఉండ్రాజవరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

నిడదవోలు రూరల్: రావిమెట్లలో ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మునిపల్లిలో లక్ష్మీనారాయణస్వామి ఆలయంలోని అభయాంజనేయస్వామికి అభిషేకాలు జరిపించారు. తిమ్మరాజుపాలెం సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు రామకృష్ణ, శ్రీను, మునియ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

పెరవలి: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు.యువత మోటారుసైకిళ్లపై పెరవలి, నల్లాకులవారిపాలెం, కాపవరం, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, ముక్కామల, ఖండవల్లి గ్రామాల మీదుగా ర్యాలీ నిర్వహించారు.



బ్రాహ్మణ గూడెంలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న ఎంపీపీ జెడ్పీటీసీ

చాగల్లు: బ్రాహ్మణ గూడెంలో ఆంజనేయ స్వామి ఆలయంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు గరపాటి విజయదుర్గా , శ్రీనివాస్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి, సర్పంచ్ గురువెల్లి కుమారి తదితరులు పూజలు నిర్వహించారు. అదేవిధంగా చాగల్లు మెయిన్‌రోడ్డులో ఉన్న ఆంజనేయ స్వామివారి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊనగట్ల బీసీ ఏరియాలో ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని అభయాంజనేయ స్వామి వారికి అర్చకులు పెరవలి సాయి ఆధ్వర్యంలో సామి వారికి సింధూర పూజ, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మలకపల్లి కొత్తపేటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. అదేవిధంగా తాళ్లపూడి, ప్రక్కిలంక, అన్నదేవరపేట తదితర గ్రామాల్లో హనుమత్ జయంతి నిర్వహించారు.

గోపాలపురం: స్థానిక సీతారామస్వామి వారి ఆలయం వద్ద 18 అడుగుల ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మండలంలోని దొండపూడి, కొవ్వూరుపాడు, గుడ్డిగూడెం, చిట్యాల, వాదాలకుంట గ్రామాలలో అన్నసమారాధన నిర్వహించారు.

నిడదవోలు: పట్టణంలోని దాసాంజనేయ స్వామివారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, తమలపాకులు, తులసీదళాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

దేవరపల్లి: దేవరపల్లి–గోపాలపురం రోడ్డులోని అభయాంజనేయస్వామి వారి ఆలయం వద్ద సువర్చలా హనుమాన్ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు, కల్యాణ అక్షితలు అందజేసి, భారీ అన్నసమారాధన నిర్వహించారు. మండలంలోని బందపురం, దుద్దుకూరు, గౌరీపట్నం, యర్నగూడెం గ్రామాల్లో హనుమత్ జయంతి వేడుకలను నిర్వహించారు.

మండు వేసవిలో మంచు దుప్పటి



యాదవోలులో దుప్పటిలా కమ్ముకున్నపొగమంచు

దేవరపల్లి: ఒక పక్క సూర్యుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడుతుండగా, మరో పక్క దట్టమైన పొగ మంచు కమ్ముకుంది. ఆదివారం ఉదయం 7.30 గంటల వరకూ పొగ మంచు కురుసింది. మండు వేసవిలో మంచు దుప్పటిలా కప్పడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.